## దివ్యాంగులకు భరోసానిచ్చిన మంత్రి కేటీఆర్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 19 : హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి గురువారం భారత జాగృతి దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కుమారస్వామి గౌడ్ ఆధ్వర్యంలో 50 మంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనానికి మంత్రి కేటీఆర్ హాజరై దివ్యాంగులకు భరోసా కల్పించారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. తరలిన వారిలో జిట్టబోయిన ప్రశాంత్, ముదురుకోళ్ల నర్సయ్య, సతీశ్, ప్రభాకర్, శంకర్, చంద్రప్రకాష్, రాకేశ్ తదితరులున్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి తరలి వెళ్తున్న దివ్యాంగులు



సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో నాగేశ్వరరావు

## అర్హులను ఓటరుగా నమోదు చేయాలి

**జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వరరావు**

చిట్యాల, అక్టోబర్ 19 : మండలంలో 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వరరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీలతో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ ఈనెల 30 వరకు ఉందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా అర్హులను గుర్తించి ఓటరుగా నమోదయ్యేలా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, అధికారులు తదితరులున్నారు.

## సంక్షేమ పథకాలే గండ్ర గెలుపునకు నాంది

రేగొండ, అక్టోబరు 19 : ప్రభుత్వ సంక్షేమ పథకాలే గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపునకు నాంది అవుతాయని బీఆర్‌ఎస్ రేగొండ, గోరికొత్తపల్లి మండలాల అధ్యక్షులు అంకం రాజేందర్, మటిక సంతోష్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే గండ్ర గెలుపును కోరుతూ రేగొండ మండలంలోని లింగాల, గోరికొత్తపల్లి మండల కేంద్రంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను, ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో గండ్రకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల పాపిరెడ్డి, గంపల లింగయ్య, పాతపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించాలి

మహదేవపూర్, అక్టోబర్ 19 : బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోల్కొండ కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని ఎడపల్లిలో ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంతో తెలంగాణ అభివృద్ధి సాధించిందన్నారు. మంథని నియోజక వర్గంలో 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని పుట్ట మధు నాలుగేండ్లలో చేసి చూపించారని, రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ చిన్న మల్లయ్య, వేమునూరి జక్కయ్య, లింగాల రామయ్య, సమ్మయ్య, నిరంజన్, తలారి గట్టయ్య, చిలుక రమేశ్, చేకుర్తి రాజబాపు, గోమాస రాజు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## రాపల్లికోట బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

మహదేవపూర్, అక్టోబర్ 19 : మంథని నియోజక వర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్ ఆదేశాల మేరకు రాపల్లికోట బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా పంచిక వెంకటస్వామి, మహిళా గ్రామ శాఖ అధ్యక్షురాలిగా తోట మల్లక్క, ఉపాధ్యక్షురాలిగా భువనగిరి మానసను నియమించినట్లు మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, మహిళా మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో గురువారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతి బాపు, మంథని డివిజన్ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత, పెండ్యాల మనోహర్, ఎండీ అలీం ఖాన్, వేమునూరి జక్కయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

## అంతర్ రాష్ట్ర వంతెన వద్ద తనిఖీలు

కాళేశ్వరం, అక్టోబర్ 19: కాళేశ్వరం గోదావరి నదిపై గల అంతర్ రాష్ట్ర వంతెన వద్ద గురువారం ఎస్సై లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వచ్చిపోయే వాహనాలను ఆపి సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వదిలిపెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పరిమితికి మించి డబ్బులు కలిగి ఉండకూడదని ప్రయాణికులకు సూచించారు.

# తనిఖీల్లో రూ. 12.12 లక్షలు పట్టివేత

మొగుళ్లపల్లి, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన ఇంటర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 12.12 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై జాడి శ్రీధర్ తెలిపారు. మండలంలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన జన్నె శోభ, గూడెపు లక్ష్మి, దర్శనాల రాజేశ్వరి ఆటోలో వెళుతుండగా వారిని తనిఖీ చేశామన్నారు. శోభ, లక్ష్మి వద్ద రూ. 4 లక్షల చొప్పున, రాజేశ్వరి వద్ద రూ 4.12 లక్షలు లభించినట్లు తెలిపారు. వారు ఎలాంటి ఆధారాలు చూపనందున నగదును సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.



పట్టుకున్న నగదును చూపిస్తున్న ఎస్సై శ్రీధర్



మహదేవపూర్ : మహాచండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

# దుర్గామాతకు మున్సిపల్ చైర్‌పర్సన్ పూజలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 19 : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి

**మహదేవపూర్‌లో..**

మహదేవపూర్ : మండల కేంద్రంలోని గర్భగౌరీ ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారు లలితా పరమేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ అర్చకులు మాడుగుల చంద్రశేఖర శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు జీసీసీ మేనేజర్ హరిలాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే దుబ్బగూడెంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మహా చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మోటం మెంకటేశ్వర్లు, కేదారి నాగరాజు, వడిజ రామకృష్ణ, నరసింహాస్వామి, గట్టయ్య, రాజా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిరోజూ ఆటలాడితే ఆరోగ్యం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 19 : ప్రతిరోజూ గంట సేపు ఆటలాడితే ఆరోగ్యంగా ఉంటారని 11వ వార్డు కౌన్సిలర్ బానోత్ రజితా జుమ్ములాల్ అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్‌గడ్డలో దసరా పండుగను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి నచ్చిన క్రీడల్లో సాధన చేస్తే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వార్డు అధ్యక్షుడు గుండ్ర కుమార్, నాయకులు మోతె రాజు, జాగరి అజయ్‌కుమార్, పోలవేని ప్రసాద్, వేషాల రవీందర్, బోయిన అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మిత్రులు

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి)కి చెందిన మూసాపురి రమేశ్ ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా, అతడి పదో తరగతి మిత్రులు ఆర్థిక చేయూతనందించారు. వారంతా కలిసి జమ చేసిన డబ్బులు రూ. 36,500 సంబంధించిన చెక్కును గురువారం మృతుడి భార్యకు అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కట్కూరి నరేందర్, మేడిపల్లి శ్రీనివాస్, సంకెళ్ల యుగంధర్, రాజేందర్, తూముల ప్రసాద్, మాడిశెట్టి తిరుపతి, పులి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

గణపురం, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని బాలాజీ ఐరన్ అండ్ హార్డ్ వేర్ యజమాని ఆవుల కిరణ్ తల్లి ఐలమ్మ, మహేందర్ మృతి చెందగా గురువారం వారి పార్థివ దేహాలకు భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మోటపోతుల శివశంకర్ గౌడ్, మంద అశోక్ రెడ్డి, గుర్రం తిరుపతి గౌడ్, మల్లికార్జున్ యాదవ్, సాంబయ్య, వండ్లకొండ నారాయణ గౌడ్, బత్తిని శివ శంకర్ గౌడ్, గాజర్ల చింటు, మార్క కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 19 : ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశామని, 43 మందికి 35 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా జరగడానికి సిట్టింగ్ స్క్వాడ్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.